క్లుప్తంగా

అంతర్జాతీయ సదస్సులో కమిషనర్ సూర్యతేజ



సదస్సులో పాల్గొన్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ నగరంలో ఈనెల 5వ తేదీ వరకు జరుగుతున్న ఏషియా పసిఫిక్ 3ఆర్ అంతర్జాతీయ సదస్సులో కేంద్ర అర్బన్ అఫైర్స్ మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌తో కలిసి నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ సోమవారం పాల్గొన్నారు. మొత్తం 38 దేశాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొని, వ్యర్థాల నిర్వహణ అంశంపై చేపడుతున్న విధానాలను చర్చించారు.

నిబంధనలు తప్పక పాటించాలి

• నగర డీఎస్పీ సింధుప్రియ



మాట్లాడుతున్న నగర డీఎస్పీ

నెల్లూరు(క్రైమ్) : ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని నగర డీఎస్పీ పి.సింధుప్రియ ఆటోడ్రైవర్లకు సూచించారు. రంగనాయకులపేటలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు మోటార్ వాహన చట్టం, సవరించిన జరిమానాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సింధుప్రియ మాట్లాడుతూ రహదారి భద్రత అందరి బాధ్యత అన్నారు. రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ వాహనాలను నడిపి ప్రజలను గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేయాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, మద్యం మత్తులో వాహనం నడపరాదని, మితిమీరిన వేగం తగదన్నారు. ఆర్సీ, పొల్యూషన్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సు తదితరాలను వెంట ఉంచుకోవాలని ఆటోడ్రైవర్లకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఈ సదస్సులో సౌత్ ట్రాఫిక్ ఎస్సై వెంకటరావు, ట్రాఫిక్ ఆర్ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న కారణంగా వెంకటేశ్వరపురం, ఇస్లామ్‌పేట, నల్లకాలువ, పునరావాస కాలనీ, డెయిరీ ప్రాంతం, అంబేడ్కర్ కాలనీ, వెంకటేశ్వరపురం మెయిన్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని సిబ్బందికి సహకరించాలని కోరారు.

వాట్సాప్ ద్వారా 32 రకాల సేవలు

నెల్లూరు(బారకాసు) : రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ ద్వారా నూతనంగా 32 రకాల ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ వైఓ నందన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 95523 00009 నంబర్ ద్వారా ఆస్తి పన్ను, నీటి చార్జీలు, మురుగునీటి కనెక్షన్, ట్రేడ్ లైసెన్సులు, వివాహ నమోదు తదితర సేవలతో కలిపి మొత్తం 32 రకాల పౌరసేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి




ఏడుకొండలు మృతదేహం

ముత్తుకూరు: మండలంలోని ముత్తుకూరులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై విశ్వనాథరెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. బోడిస్వామికండ్రిగకు చెందిన పోకపూడి ఏడుకొండలు(28) రొయ్యల మేత కోసం మోటార్‌బైక్‌పై ముత్తుకూరుకు వెళ్లాడు. తిరిగి ఊరికి వస్తుండగా బీసీ కాలనీలో ఏడుకొండలు ఆటోను ఓవర్‌టేక్ చేశాడు. అయితే ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం అతడి బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కాలుష్యం కబళిస్తోంది

- మూడో డివిజన్ వాసులకు తప్పని తిప్పలు
- తాగునీరు, ఆహారాల్లో పడుతున్న నల్లటి ఊక
- రైస్ మిల్లులను తొలగించాలని స్థానికుల డిమాండ్

రైస్ మిల్లులు కాలుష్య కారకాలుగా మారాయి. నివాస ప్రాంతాల మధ్య ఉండే ఈ బియ్యం మిల్లులు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నాయి. ఇక్కడి బాయిలర్ నుంచి వచ్చే పొగ, పొట్టు కారణంగా వెలువడే వ్యర్థాలు నేరుగా గాలిలో కలుస్తున్నాయి. అలా నల్లటి ఊక నివాసాల మీద పడడంతో తాగునీరు, ఆహారం కూడా కలుషితం అవుతున్నాయి.



ఇళ్ల మధ్య మిల్లుల నుంచి వస్తున్న పొగ



నల్లటి ఊక వల్ల కలుషితమైన నీరు

నెల్లూరు సిటీ : నగరంలోని మూడో డివిజన్ పరిధిలో కిసాన్‌నగర్, ప్రశాంతినగర్, మూడో మైలు, మధురానగర్ తదితర ప్రాంతాల్లో దాదాపు 12 వేల మందికి పైగా నివసిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో పదికి పైగా రైస్ మిల్లులు ఉన్నాయి. ఆయా మిల్లుల్లో ప్రతిరోజూ ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తుంటారు. ఈ క్రమంలో మిల్లుల నుంచి నల్లటి ఊక గాలిలోకి వ్యాపించి స్థానిక నివాసాల వద్ద పడుతోంది. దీనిపై అనేక దఫాలు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదు.

ఇళ్ల మధ్యే మిల్లులు

20 ఏళ్ల క్రితం ఈ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా వలసలు పెరిగి ఉద్యోగులు, వ్యాపారాల నిమిత్తం అనేక మంది స్థానికంగా గృహాలను నిర్మించుకున్నారు. రోజురోజుకు ఇక్కడ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. దీనివల్ల ఈ ప్రాంతం రెసిడెన్షియల్‌గా మారింది. అప్పట్లో ఈ ప్రాంతంలో జనాభా నివసించే వారు తక్కువగా ఉండేవారు. పదుల సంఖ్యలో రైస్‌మిల్లులు ఉండేవి. గృహాలు తక్కువగా ఉండడంతో రైస్‌మిల్లులు కొనసాగినా ఎవరికీ ఇబ్బంది ఉండేది కాదు. గృహ నిర్మాణాలు పెరిగిన నేపథ్యంలో గతంలో రైస్‌మిల్లులకు ఇఫ్కో సెజ్‌లో స్థలాలు కేటాయిస్తామని, ఆ ప్రాంతానికి తరలివెళ్లాలని నోటీసులు కూడా ఇచ్చారు. అయితే రైస్‌మిల్లుల యజమానులు ఇక్కడి నుంచి వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో రైస్‌మిల్లులు ప్రతి రోజూ నల్ల బూడిదను వదులుతున్నారు.

అనారోగ్యాల బారిన ప్రజలు

రైస్‌మిల్లుల కారణంగా నిత్యం దుమ్ము, ధూళితో స్థానిక ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. చిన్నారులు, వృద్ధుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. గంట వ్యవధిలో ఇళ్ల ముందు, మిద్దెలపై నల్లటి ఊక చేరుతోంది. ఇళ్లలోని ఆహారాలు, తాగునీటిలోనూ ఇవి కలుస్తున్నాయి. పార్కింగ్ చేసిన వాహనాలు రెండు రోజులు తుడవకుంటే పూర్తిగా నల్ల ఊక పేరుకుపోతోంది. దీంతో వాహనాలు తప్పుపడుతున్నాయి. రైస్ మిల్లుల వల్ల వచ్చే సమస్యలను ప్రజలు అనేకసార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చిన నాయకులు అనేక హామీలు ఇస్తున్నారని, ఎన్నికలు పూర్తయ్యాక సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

నిత్యం నల్లబూడిద వస్తోంది



మా ప్రాంతంలో నిత్యం నల్లబూడిద వస్తోంది. దీంతో దుస్తులు, వస్తువులు నల్లరంగులోకి మారిపోతున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– శ్రీలక్ష్మి, బీటెక్ విద్యార్థిని

తాగునీరు, ఆహారం కలుషితం



మిల్లుల నుంచి వచ్చే ఊక కారణంగా తాగునీరు, ఆహారం కలుషితం అవుతోంది. దీంతో పలువురు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇంటి మిద్దెలపై వాటర్ ట్యాంకులను వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాల్సి వస్తోంది.

– శ్రీనివాసులు, మధురానగర్

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

మిల్లుల నిర్వాహకులు నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. మిల్లులను తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం. ప్రతిఒక్కరూ గాలి కాలుష్యం కాకుండా సహకరించాలి.

– అశోక్‌కుమార్, ఈఈ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు

నేత్రదానం



నేత్రదాన సర్టిఫికెట్ అందజేత

నెల్లూరు(అర్బన్) : స్థానిక మూలాపేట కోనేటిమిట్టలో నివాసం ఉంటున్న పమిడి రత్నకుమారి (52) అనారోగ్యంతో సోమవారం నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందారు. చిరంజీవి ఐ బ్యాంకు సంస్థ ఇన్‌చార్జి సుధీర్ సహకారంతో మృతురాలి కుటుంబ సభ్యుడు రవికుమార్ అంగీకారంతో ఆమె నేత్రాలను జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం రత్నకుమారి కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందించారు. నేత్రదానం చేయదలిచిన వారు సునీల్‌నంబర్(99595 89321), సుధీర్ (98666 16565) నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

అనధికార మద్యం విక్రయాలపై దాడులు

• ఒకరి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్) : రూరల్ పరిధిలోని కోడూరుపాడు గ్రామంలో అనధికార మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న శ్యాంబాబ్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి తొమ్మిది క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ప్రభాకర్, హెడ్‌కానిస్టేబుల్ ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల లార్వా సర్వే



రాజాగారి వీధిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

నెల్లూరు(అర్బన్) : నగరంలోని మూలాపేట రాజాగారి వీధి, శివాలయం వీధి, చమ్మంది వారి తోట తదితర ప్రాంతాల్లో వైద్య శాఖ ఆధ్వర్యంలో కీటక జనిత ఫీవర్ లార్వా సర్వే సోమవారం జరిగింది. ఇటీవల గ్రీవెన్స్‌లో రాజాగారి వీధికి చెందిన భరత్ అనే వ్యక్తి తమ ప్రాంతంలో జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని, దోమల ఉధృతి ఉందంటూ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా మలేరియా నివారణాధికారి ఎం.హుస్సేనమ్మ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ కీటక జనిత లార్వాతో పాటు ఎన్‌సీడీ సర్వే చేశారు. కాలువలను శుభ్రం చేయించారు. దోమల నివారణ మందును స్ప్రే చేయించారు. సిబ్బంది నందకుమార్, కోటమిట్ట అర్బన్‌హెల్త్ సెంటర్ కో–ఆర్డినేటర్ తిరుపతయ్య, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హోమ్‌గార్డుల బదిలీకి వినతి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న మున్నా

నెల్లూరు(క్రైమ్) : ఆంధ్రప్రదేశ్‌కు చెంది తెలంగాణ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న హోమ్‌గార్డులను తక్షణమే ఏపీకి బదిలీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి షేక్ మున్నా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ సౌజన్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్నా మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన అనేక మంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హోమ్‌గార్డులుగా ఎంపికై తెలంగాణలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో స్థానికతను బట్టి అన్ని ప్రభుత్వశాఖల ఉద్యోగుల బదిలీలు జరిగాయని, ఇంతవరకు హోమ్‌గార్డుల బదిలీ జరగలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం బదిలీలకు అభ్యంతరం లేదని ప్రకటించినా ఏపీ ప్రభుత్వం హోంగార్డుల విషయంలో స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



ఎంజీబీ మాల్లోని షోరూమ్‌లను తనిఖీ చేస్తున్న హెల్త్ ఆఫీసర్

నెల్లూరు(బారకాసు) : దుకాణాలు, షోరూంలు, మాల్స్‌లలో నిర్వహించే ఎటువంటి వ్యాపారానికైనా తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య సూచించారు. నగరంలోని ఎంజీబీ మాల్‌ను ఎంహెచ్‌ఓ సోమవారం సందర్శించారు. పలు షోరూమ్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల నిర్వాహకులను ట్రేడ్ లైసెన్స్ తీసుకున్నారా లేదా.. అని ఆరాతీశారు. అలాగే ఎంజీబీ మాల్‌లోని రెస్టారెంట్స్‌ను తనిఖీ చేసి అక్కడ పారిశుద్ధ్యాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా నగరంలోని 12/3, 17/2, 13/1 వార్డు పరిధిలోని ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

ఎన్‌యూసీసీ జట్టు విజయం



విజయం సాధించిన ఎన్‌యూసీసీ జట్టు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : వీఎస్సార్ మెమోరియల్ టీ–20 కప్‌ను ఎన్‌యూసీసీ జట్టు కైవసం చేసుకుంది. బుజబుజ నెల్లూరు సీఏఏ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ పోటీలో నెల్లూరు యునైటెడ్ క్రికెట్ క్లబ్(ఎన్‌యూసీసీ) –లార్డ్స్ క్రికెట్ క్లబ్‌ల జట్లు సోమవారం తలపడ్డాయి. 25 పరుగుల తేడాతో ఎన్‌యూసీసీ జట్టు విజయం సాధించింది. ఏసీఏ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ విజయ్‌కుమార్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కె.మునిగిరీష్, ఏసీఏ మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి హాజరై బహుమతులు అందజేశారు. ఎన్‌డీసీఏ కేర్ టేకర్ డి.శ్రీనివాసులురెడ్డి, సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, లీలా మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ ప్రకటనలపై కఠిన చర్యలు

నెల్లూరు(అర్బన్): లింగ నిర్ధారణపై ఎలాంటి కరపత్రాలు పంపిణీ చేసినా, వాణిజ్య ప్రకటనలు జారీ చేసినా పోస్టర్లు విడుదల చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ సుజాత సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం, 1994 ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. జిల్లాలో లింగ నిర్ధారణకు సంబంధించి ఎవరైనా అవకతవకలకు పాల్పడితే 1800 425 3365 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పీఆర్టీయూ విజయంపై సంబరాలు



నెల్లూరు (టౌన్) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి శ్రీనివాసులునాయుడు విజయం సాధించడం పట్ల ఆ సంఘ జిల్లా నేతలు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలయ్య మాట్లాడుతూ గాదె శ్రీనివాసులునాయుడు మూడో సారి ఎమ్మెల్సీగా విజయం సాధించారన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా నెల్లూరు పీఆర్టీయూ నాయకులు గుంటూరుకు చేరుకుని సంబరాలు చేసుకున్నట్లు తెలిపారు. పీఆర్టీయూ జిల్లా నాయకులు వెంకటరాజు, సైమన్ కుమార్, ఖాజా రహంతుల్లా పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(క్రైమ్) : అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్ కర్ర అక్రమ తరలింపును అడ్డుకున్న తమపై కొందరు దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు దామా వెంకయ్య, కార్యదర్శి రామదాసులు కోరారు. ఈ మేరకు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ కృష్ణకాంత్‌ను సోమావారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఉదయగిరి, వరికుంటపాడు, కలిగిరి, దుత్తలూరు తదితర ప్రాంతాల్లో అగ్రిగోల్డ్ భూములున్నాయన్నారు. వాటిలో ఉన్న వందల కోట్ల విలువ చేసే జామాయిల్, ఎర్రచందనం దుంగలను కొందరు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. గతనెల 18వ తేదీన కనియంపాడు జామాయిల్ తోటల పరిశీలనకు వెళ్లిన తమపై, తమతో పాటు వచ్చిన మరికొందరిపై కొందరు దాడి చేసి గాయపరిచారన్నారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తమపై దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమార్కులు కొల్లగొట్టిన జామాయిల్ కర్రలు, ఎర్రచందనం దుంగలను రికవరీ చేయాలని వారు కోరారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజావరోహణ



ధ్వజావరోహణను గావిస్తున్న అర్చకుడు

• వేడుకగా తీర్థవాది



స్వామివారి ఉత్సవం

నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11వ రోజు సోమవారం రాత్రి ధ్వజావరోహణ, తిరుచ్చి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం తీర్థవాది వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారు విశేష పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు.

తీర్థవాది ఉభయకర్తలుగా ఆలయ అర్చకులు, దేవస్థానం సిబ్బంది, ధ్వజావరోహణ, తిరుచ్చి ఉత్సవం ఉభయకర్తలుగా మన్నెం జీవన్‌శేఖర్ రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి



మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ, విజయలక్ష్మి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఆశా వర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, అధ్యక్షురాలు విజయలక్ష్మి కోరారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆశాలకు కనీస వేతనం, మట్టి ఖర్చులు, ఇన్సూరెన్స్ సౌకర్యం, చనిపోయిన ఆశాల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం లాంటి అంశాలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం విచారకరమన్నారు. తమ హక్కుల సాధన కోసం ఈనెల 6న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర వ్యాప్త ధర్నాకు జిల్లాలోని ఆశా వర్కర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ కోశాధికారి మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు పరిష్కారం చూపండి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : ప్రజల నుంచి వస్తున్న సమస్యలకు నిర్దేశించిన గడువులోపు పరిష్కారం చూపాలని అదనపు కమిషనర్ వైఓ నందన్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎస్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. అదనపు కమిషనర్ పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడ్కో గృహాలు రద్దయిన వారికి చెల్లించిన మొత్తాలను తిరిగి ఇవ్వడంతో పాటు, ఆయా గృహాలను నూతన లబ్ధిదారులకు కేటాయించనున్నామని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ప్రజల నుంచి ఎక్కువగా రోడ్ల మరమ్మతులు, నూతన రోడ్ల మంజూరు, డ్రెయిన్ నిర్మాణం, రెవెన్యూ విభాగానికి సంబంధించి అసెస్మెంట్ నంబర్లలో చిన్నపాటి సవరణలు, మార్పు, చేర్పులకు వినతులు వస్తున్నాయన్నారు. ఇప్పుడు వస్తున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా నిర్ణీత సమయంలోగా శాశ్వత పరిష్కారం అందించాలన్నారు. విభాగాల వారీగా ఇంజినీరింగ్–9, హౌసింగ్–17, టౌన్ ప్లానింగ్–9, రెవెన్యూ–1, పబ్లిక్ హెల్త్–4, డీఈఓ–1 ఇలా మొత్తం 41 ఫిర్యాదులను స్వీకరించామని వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, సీపీ పద్మజ, మేనేజర్ ఇనాయతుల్లా, ఇతర విభాగాల అధికారులు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.